రైతుల మరణాలు.. ప్రభుత్వ హత్యలే

- మాజీ మంత్రి విడదల రజిని
- గిట్టుబాటు ధర లేక అప్పులపాలయ్యారు
- తక్షణం ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్
- బాధిత కుటుంబాల పరామర్శ



రైతు గోపాలరావు మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న రజిని

చిలకలూరిపేట: నియోజకవర్గంలో ఇరువురు రైతుల మరణాలు ప్రభుత్వ హత్యలేనని మాజీమంత్రి విడదల రజిని ఆరోపించారు. నాదెండ్ల మండలానికి చెందిన రైతులు నాశ్యం ఆదినారాయణ (45), శిరిబోయిన గోపాలరావు (43) పురుగుల మందు సేవించి బలవన్మరణానికి పాల్పడ్డారు. మంగళవారం చిలకలూరిపేట ఏరియా ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం ఇరువురు రైతుల మృతదేహాలు తీసుకువచ్చారు. రైతుల మృతదేహాలకు మాజీ మంత్రి రజినీ నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక, పంటలు అమ్ముకోలేని దుస్థితిలో ఇరువురు రైతులు ఆత్మహత్యకు పాల్పడటం ఎంతో బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రానికి చెందిన ఆదినారాయణ ఇదే మండలంలోని తుబాడుకు చెందిన గోపాలరావు వ్యవసాయాన్నే నమ్ముకొని జీవిస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది వారు పండించిన మిర్చి, పత్తి, పొగాకు పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఆర్థికంగా నష్టపోయి, అప్పులపాలై చివరకు బలవన్మరణానికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ అసమర్థతవల్లే జరిగిన మరణాలని ధ్వజమెత్తారు. ఏడాది కాలంలో ఏ ఒక్క పంటకు కనీసం గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల కోసం రోడ్డెక్కినా ప్రభుత్వం ఏ మాత్రం స్పందించలేదని ఆరోపించారు. ఇటీవల మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గుంటూరు మిర్చియార్డు, పొదిలి పొగాకు వేలం కేంద్రాలను సందర్శించి రైతుల గోడుపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారన్నారు. గిట్టుబాటు ధర కల్పించకపోతే రైతులతో కలసి ఉద్యమిస్తామని హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేశారు.

రైతులను ఆదుకుంటున్నామంటూ మాయమాటలు చెప్పి, తర్వాత పట్టించుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించటం వల్లే నేడు నాదెండ్ల మండలంలో ఇద్దరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఉంటే, వారు ఈరోజు ఇలా ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చేదాని ప్రశ్నించారు. మృతి చెందిన రైతు కుటుంబాలకు ప్రభుత్వం తక్షణం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. వై.ఎస్.జగన్ ప్రభుత్వ హయాంలో రైతులు ఆత్మహత్యలు చేసుకోకుండా, వారి పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించటం, పంటలు నష్టపోయే సమయంలో తక్షణం పరిహారం చెల్లించటం, పెట్టుబడి సాయాన్ని అందించటం ద్వారా వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి విత్తనం నుంచి విక్రయం దాకా రైతులకు అండగా నిలబడ్డారని, ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి ఆదుకున్నారని ఆమె వెల్లడించారు.

కుప్పం ఘటనపై చంద్రబాబు వివరణ ఇవ్వాలి

కుప్పంలో అప్పు వసూలు కోసం స్థానిక టీడీపీ నాయకుడు ఓ మహిళను చెట్టుకు కట్టేసి ఎలా హింసించారో ప్రజలు చూశారని తెలిపారు. ఈ రాష్ట్రంలో అసలు శాంతి భద్రతలు అమలులో ఉన్నాయా అనే అనుమానం కలుగుతోందన్నారు. మహిళలపై అడుగడుగునా అఘాయిత్యాలు, అరాచకాలు జరుగుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వై.ఎస్.జగన్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన దిశ యాప్, దిశ పోలీస్ స్టేషన్లను కుట్ర పూరితంగా తీసేశారన్నారు. దీంతో మహిళలకు ఎటువంటి రక్షణ లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. తన సొంత నియోజకవర్గంలో జరిగిన ఈ దారుణంపై సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెడ్ బుక్ రాజ్యాంగంతో రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆమె వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.



మృతుడి భార్య భవానిని ఓదారుస్తున్న మాజీ మంత్రి

అన్నదాత సుఖీభవ పథకం అర్హులకు అందాలి

వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బోడెపూడి కొండలు

శావల్యాపురం: అన్నదాత సుఖీభవ పథకంలో అర్హత కల్గియున్న రైతులందరికీ లబ్ధిచేకూరేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బోడెపూడి వెంకటేశ్వర్లు (కొండలు) ప్రభుత్వాన్ని మంగళవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీలో 12 వేల మంది రైతులు అర్హత కల్గియున్నట్లు వ్యవసాయ అధికారులు నిర్ధారణ చేయటంతో పాటు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హత కల్గియున్న వారందరికీ రైతుభరోసా పథకం ద్వారా రైతుల బ్యాంకు ఖాతాలో నగదు జమ చేశామన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలో 6 వేల మందికి మాత్రమే అర్హత పొందారని రైతుసేవా కేంద్రాల్లో జాబితాను ప్రచురణ చేయటంతో పాటు వ్యవసాయ అధికారులు చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. దానికితోడు రైతుసేవా కేంద్రాల్లో ఈకేవైసీ నమోదు చేసుకునేందుకు రైతులు వెళ్లగా కొందరు భూములు ప్రభుత్వ భూములుగా నమోదు కావటం అదే విధంగా ఒక్కో గ్రామంలో 300 నుంచి 400 మంది అనర్హులుగా ఉన్నట్లు రైతులు మా దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి అధికారులు ప్రభుత్వం పునఃపరిశీలన చేసి అర్హులను గుర్తించాలన్నారు. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకంలో ఆంక్షలు విధించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తే వారికి అండగా ఉంటామన్నారు. ఆయనతో పాటు మాజీ సర్పంచ్ తన్నీరు అంకారావు, బొల్లా సుబ్బారావు, బోడెపూడి శ్రీనివాసరావు, తిరివిధి రమణారావు ఉన్నారు.

వారంలోగా వార్షిక ప్రణాళికలు పూర్తి చేయాలి

యడ్లపాడు మండల సమైక్య అధ్యక్షురాలు ఆర్.నాగలక్ష్మి



మాట్లాడుతున్న హేమలతాదేవి

యడ్లపాడు: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం, 2025వ సంవత్సరానికి సంబంధించి ఆరవ మండల మహిళా సమైక్య సమావేశం అధికారులు నిర్వహించారు. యడ్లపాడు మండల సమైక్య అధ్యక్షురాలు ఆర్.నాగలక్ష్మి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో డ్వాక్రా సంఘాల ప్రగతిని సమీక్షించడమే కాక, పలు కీలక అంశాలపై చర్చించి, కార్యాచరణకు మార్గనిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో 1342 డ్వాక్రా సంఘాలు, 39 గ్రామైక్య సంఘాలు, 35 మంది వీఏవోలు ఉన్నాయని, ఆయా సంఘాలు తమ వార్షిక ప్రణాళికలో భాగంగా ఇప్పటికే 846 గ్రూపులు 86శాతం పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. మిగిలిన 387 గ్రూపుల పనులను మరో వారంరోజుల వ్యవధిలోగా పూర్తి చేయాలని సంబంధిత వీవోఏ, సీసీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డ్వాక్రా సంఘాల వీవో పుస్తకాలను ఈ నెలాఖరుకు పూర్తి చేసి, 2025–26 ఆర్థిక సంవత్సర ఆడిట్‌కు సిద్ధంగా ఉంచాలన్నారు. ఇది ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో సమగ్రంగా చేయాలని పేర్కొన్నారు. స్త్రీ నిధి–ఉన్నతి, సీఐఎఫ్ రికవరీని 100 శాతం పూర్తి చేయాలని జిల్లాస్థాయి నుంచి వచ్చిన సూచనల ఆధారంగా తెలియజేశారు. ప్రధానంగా మహిళా సంఘాల ప్రగతి, కార్యాచరణ, పథకాల అమలు, రికవరీ, ఆడిట్ లాంటి అంశాలపై స్పష్టత ఇచ్చి, ముందున్న లక్ష్యాలను చేరుకునే దిశగా సమైక్య సంఘాల దృష్టిని కేంద్రీకరించాలని అధికారులు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ముందుస్తు ప్రణాళిక రూపకల్పనకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి...

ఎంపీడీవో వి.హేమలతాదేవి మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకానికి సంబంధించి ప్రతి ఇంటికీ ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ బిల్లులు రూ.వెయ్యి నుంచి రూ.2 వేలు వచ్చే వారికి ఈ పథకం ఎంతో ప్రయోజనకరమన్నారు. ఈ పథకం యూనిట్ విలువ మొత్తం రూ.2.10 లక్షలు ఉంటుందన్నారు. అయితే రూ.1.38 లక్షల బ్యాంకు రుణం ఇవ్వగా, రూ.21 వేల సబ్సిడీ లభిస్తుందన్నారు. పథకం లబ్ధిదారుడు రూ.78 భాగస్వామ్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ సౌరఫలాలతో ప్రతినెలా 300 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి కాగా, లబ్ధిదారులు వినియోగించుకోగా, మిగిలిన దానిని ప్రభుత్వ గ్రిడ్‌కు వినియోగించుకుని నగదు పొందే అవకాశం ఉందని తెలిపారు. అలాగే ప్రతి ఇంట్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయడం ద్వారా కుటుంబ ఆహార భద్రతను మెరుగుపర్చాలని సూచించారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎం పథకాల కింద రుణాలను త్వరితగతిన బ్యాంకుల ద్వారా అందించేలా అధికారులపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో మండల సమైక్య కార్యదర్శి ఎ.శ్రీలక్ష్మీ, కోశాధికారి బొంతా థామసమ్మ, ఏపీఎం కె రవీంద్ర కుమార్, గ్రామసంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

పిల్లలను నేను చదివిస్తున్నా..

డబ్బులు భార్య ఖాతాలో వేశారు!

- తల్లికి వందనం డబ్బులు నాకు ఇప్పించండి
- ఎంపీడీవోకు తండ్రి వేడుకోలు



ఎంపీడీవో స్వరూపరాణితో మాట్లాడుతున్న పసుపులేటి రాము

నాదెండ్ల: తల్లికి వందనం పథకం ద్వారా తన భార్య ఖాతాకు జమ అయిన నగదును తనకు ఇప్పించాలంటూ చందవరం గ్రామానికి చెందిన పసుపులేటి రాము మంగళవారం అధికారులను వేడుకున్నాడు. ఈ మేరకు ఎంపీడీవో స్వరూపరాణికి మంగళవారం వినతిపత్రం అందించాడు. తనకు ఇరువురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారన్నారు. తనకు తన భార్య రజిని మధ్య మనస్పర్థలు రావటంతో ముగ్గురు పిల్లలను తన వద్దే వదిలి పుట్టింటికి వెళ్ళిపోయిందనీ, ముగ్గురు చిన్నారులను సాతులూరులోని ప్రైవేటు పాఠశాలలో వరుసగా 9, 7, 2వ తరగతులు చదివిస్తున్నట్లు వివరించాడు. ప్రభుత్వం ముగ్గురు చిన్నారుల పేరిట రూ.39 వేలు తన భార్య బ్యాంకు ఖాతాకు జమచేయగా, తాను ఫోన్ చేసి నగదు ఇవ్వాలని అడగ్గా తాను ఇవ్వనంటూ దుర్భాషలాడిందని వివరించాడు. పిల్లల భవిష్యత్ దృష్ట్యా సదరు నగదును తనకు తిరిగి ఇప్పించాలంటూ విన్నవించాడు.

పొగాకు రైతుల పరిస్థితి ఆందోళనకరం

నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు

చిలకలూరిపేట: పొగాకు రైతుల పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉందని... గిట్టుబాటు ధరలేక ఇద్దరు రైతులు ప్రాణాలు తీసుకోవడానికి ఎవరు బాధ్యత వహిస్తారని నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు ప్రశ్నించారు. నాదెండ్ల మండలానికి చెందిన ఇరువురు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యకు పాల్పడిన విషయం పై మీడియాతో మంగళవారం మాట్లాడారు. రైతుల చావుకు బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం పొగాకు కంపెనీల చేత కొనిపిస్తామని బలంగా రైతులకు చెప్పిందని వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పొగాకు కంపెనీలతో మాట్లాడుతున్నారని, కంపెనీలు కొనకపోతే ప్రభుత్వమే కొంటుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నమ్మబలికారని వెల్లడించారు. దీంతో పాటు పొగాకులో రెండు గ్రేడ్లకు సంబంధించి రూ. 12 వేలు, రూ. 6వేల చొప్పున కొంటామని హామీ ఇచ్చారన్నారు. అయితే మూడు నెలలుగా వాయిదాలు వేయడం తప్పించి చేసిందేమి లేదన్నారు. ఈ నెల ఐదోతేదీ నుంచి కొనుగోలు ప్రారంభిస్తామని, తిరిగి 17 నుంచి మంత్రి వచ్చి ప్రారంభిస్తారని వాయిదాలు వేయడం తప్పితే ఆచరణకు నోచుకోలేదన్నారు. మంత్రి వస్తున్నట్లు పత్రికా ప్రకటనలు ఇచ్చి, సాంకేతిక కారణాలు చెప్పి మంగళవారం కూడా కొనుగోళ్లు ప్రారంభించలేదన్నారు. అప్పులు చేసి పొగాకు పండిస్తే కొనుగోలు చేయాల్సిన కంపెనీలు నాణ్యమైన పొగాకు మాత్రమే తీసుకురమ్మని తిప్పి పంపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీల చేత పొగాకు కొనిపించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదని విమర్శించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కొనిపిస్తామని రైతులకు హామీ ఇచ్చిన ప్రభుత్వం కంపెనీలను ఏమీ చేయలేక పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పొగాకు అమ్మినా ఖర్చులు కూడా రావని పొగాకును పొలంలో చిమ్మితే కనీసం ఎరువుగానైనా పనికి వస్తుందని రైతులు భావించే పరిస్థితి దాపురించటం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.

ఆధునిక పంటల వైపు రైతులు దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డీడీఏ శివకుమారి

రొంపిచర్ల: రైతులను ఆధునిక పంటలపై దృష్టి సారించే విధంగా చైతన్య వంతులను చేయటంతో పాటు సాగులో ఎదురయ్యే కష్టాలను తెలుసుకొని నూతన అధిక దిగుబడులపై అవగాహన కల్పించటమే పొలం పిలుస్తోంది కార్యక్రమ లక్ష్యమని డీడీఏ శివకుమారి అన్నారు. మండలంలోని విప్పర్ల, మాచవరం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో వ్యవసాయ అనుబంధ శాఖలైన మత్స్య, పట్టు పరిశ్రమ, సేంద్రియ, మార్కెటింగ్ శాఖల అధికారులు కూడా భాగస్వాములవుతారన్నారు. ఆధునిక పంటలపై దృష్టి సారించే చర్యలతో పాటు సంబంధిత వ్యవసాయ శాస్త్రవేత్తలు సాగు రైతులను కలిసి ఇబ్బందులు తెలుసుకొని నూతన దిగుబడులపై అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. నాలుగు నెలల పాటు ఖరీఫ్, రబీ సాగులో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. పచ్చిరొట్ట ఎరువుల ప్రాధాన్యత, వివిధ స్కీంల గురించి వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఏడీఏ పి. మస్తానమ్మ, ఎంఏవో శివలలిత, గ్రామ వ్యవసాయ సహాయకులు రాజశేఖర్, విజయలక్ష్మీ, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మైనర్ బాలుడి మృతి

మరో బాలుడికి తీవ్రగాయాలు



మృతుడు రంగయ్య

వినుకొండ: అతివేగంగా ద్విచక్రవాహనం నడుపుతూ రోడ్డుపక్కన ఉన్న దర్గా గోడను ఢీకొట్టిన ప్రమాదంలో ఓమైనరు బాలుడు మృతి చెందగా మరో బాలుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ సంఘటన వినుకొండ పట్టణంలోని కారంపూడి రోడ్డులో మంగళవారం సాయంత్రం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం పట్టణంలోని వెన్రనపూస కాలనీకి చెందిన నలబోతు రంగయ్య (18), మరోబాలుడు రాజు ఇద్దరూ కలసి ద్విచక్ర వాహనంపై అతివేగంగా వెళుతూ రోడు పక్కన ఉన్న ముస్లింల దర్గా గోడను ఢీకొట్టారు. ఈప్రమాదంలో రంగయ్య అనే బాలుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. మరో బాలుడు రాజుకు చేయి విరిగింది. ఇరువురినీ వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్సపొందుతూ రంగయ్య మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గోడను ఢీ కొట్టిన ద్విచక్రవాహనం

యడ్లపాడు బాలికల జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు

ఒకే భవనంలో హైస్కూల్ నుంచి కళాశాల విద్య వరకు ఉచితం



కళాశాలలో చేరాంటూ ర్యాలీ చేస్తున్న దృశ్యం

యడ్లపాడు: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి భాగంగా మంగళవారం స్థానికంగా విద్యా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ హైస్కూల్, బాలికల జూనియర్ కళాశాల హెచ్‌ఎం జి.విజయభారతి మాట్లాడుతూ, పదవ తరగతి పూర్తిచేసిన బాలికలు ఇంటర్మీడియట్ చదువు కోసం యడ్లపాడు జెడ్పీ బాలికల జూనియర్ కళాశాలను ఎంచుకోవాలని తల్లిదండ్రులను కోరారు. తమ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో ఇంగ్లీష్ మీడియంలో ఉచిత విద్య అందుబాటులో ఉందన్నారు. పేద విద్యార్థులకు ఏ రకమైన ఆర్థిక భారం లేకుండా ఉచిత బస్‌పాస్, నోటుపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, మూడు జతల యూనిఫామ్స్, బ్యాగు, బూట్లు, బెల్టు, మెజోళ్ళు లభిస్తాయని ఆమె తెలిపారు. అలాగే, 'తల్లికి వందనం' పథకం కింద ప్రతి విద్యార్థిని తల్లికి రూ.13 వేల నగదు అందిస్తారని వివరించారు. భద్రతతో పాటు క్రమశిక్షణతో తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అడ్మిషన్ల కోసం లెక్చరర్ డి.సుధీర్ సెల్‌నం: 99898 03686ను సంప్రదించవచ్చని సూచించారు. ఇదే పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బాల బాలికలకు ఇంగ్లిష్ మీడియంలో బోధన కొనసాగుతోందని, గతేడాది సప్లిమెంటరీలతో కలిపి 100 శాతం ఫలితాలు సాధించామని పాఠశాల సిబ్బంది వెల్లడించారు. ఈ ప్రచార కార్యక్రమంలో జూనియర్ కళాశాల, హైస్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఎదుగుదలలో గురువులదే కీలకపాత్ర

విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి



నడికట్టు రామిరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నాదెండ్ల: సమాజంలో విద్యార్థుల ఎదుగుదలకు తల్లిదండ్రుల తర్వాత గురువులదే కీలకపాత్ర అని విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి చెప్పారు. మండలంలోని చిరుమామిళ్ళ శ్రీ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బదిలీ అయిన ఉపాధ్యాయులకు, బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఈ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సముచితమైన స్థానం ఉందని, పదోతరగతి పరీక్ష ఫలితాల్లో వరుసగా నూరుశాతం ఫలితాలు సాధించి జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. ఉత్తమ ఫలితాలకు ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. రానున్న విద్యాసంవత్సరంలో కూడా మంచి ఫలితాలతో పాఠశాలకు, గ్రామానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జిల్లాలో అన్ని మౌలిక వసతులు కలిగిన పాఠశాలల్లో చిరుమామిళ్ళ ఉన్నత పాఠశాల ఒకటని, పాఠశాల అభివృద్ధికి రామిరెడ్డి అందించే చేయూత ఎంతో ఉపయోగపడుతుందన్నారు. హెచ్‌ఎంలు శ్రీనివాసరావు, కరిముల్లా, ఎం సుందరరావు, కిషోర్, ఉపాధ్యాయులు వైజే రాములు, నాగమహేష్, వినీల, నీరజ, గోపి, ఆదిలక్ష్మి, సంజీవయ్య, పీడీ నాగరాజులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి మెమెంటోలు అందించారు. అనంతరం ప్రాథమిక, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు విద్యాదాత నడికట్టు రామిరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో శివారెడ్డి, వెంకటరెడ్డి ఉన్నారు.

ఆక్యుపంక్చర్‌తో దీర్ఘకాలిక వ్యాధుల నివారణ



మాట్లాడుతున్న షేక్ సాదిక్

చిలకలూరిపేట: దీర్ఘకాలిక వ్యాధులున్న బీపీ, షుగర్, హార్మోన్ల అసమతుల్యత, చర్మవ్యాధుల వంటి వాటి నివారణకు ఆక్యుపంక్చర్ వైద్య విధానం ఎంతో సమర్థవంతంగా పనిచేస్తుందని ఆక్యుపంక్చర్ థెరపిస్ట్ షేక్ సాదిక్ చెప్పారు. పట్టణంలోని గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో లైఫ్ ఆక్యుపంక్చర్ సెంటర్ ఆధ్వర్యంలో ఆక్యుపంక్చర్ థెరపీపై అవగాహన, ఉచిత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో యువత శారీరక, మానసిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా వెన్నునొప్పి, జుట్టు రాలడం, మానసిక ఆందోళనలతో బాధపడుతున్నారని వివరించారు. అలాగే వయసు పెరిగిన వారు బీపీ, షుగర్, థైరాయిడ్, పక్షవాతం, వేరికోస్‌వెయిన్స్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ వ్యాధులన్నింటికీ ఆక్యుపంక్చర్ విధానంలో సహజసిద్ధంగా నివారించవచ్చని వివరించారు. అనంతరం అసోసియేషన్ సభ్యులకు ఉచితంగా ఆక్యుపంక్చర్ వైద్యం అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు లంకా ఆదినారాయణరెడ్డి, కె.మురళీధరరావు, జి.వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

సంస్మరణ సభ జయప్రదం చేయాలి

నరసరావుపేట: దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకుడు కామ్రేడ్ దేవరపల్లి పున్నారావు సంస్మరణ సభను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ప్రజలకు పిలుపు ఇస్తూ మంగళవారం బస్టాండ్ సెంటర్‌లో సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన పీడీఎం ఆధ్వర్యంలో కామ్రేడ్ పున్నారావు 18వ సంస్మరణ సభ విజయవాడలోని గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నామని అన్నారు. దీనికి వక్తలుగా పీడీఎం రాష్ట్ర కార్యదర్శి కె.వెంకటేష్, సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు వీక్షణం పత్రిక ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, పౌరహక్కుల సంఘ రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ పాల్గొని ప్రసంగిస్తారన్నారు. ప్రజా కళామండలి వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ప్రజలందరూ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, ఎంసీపీఐ రాష్ట్ర నాయకులు అబ్రహం లింకన్, పౌరహక్కుల సంఘం జిల్లా నాయకులు శిఖనం చిన్న, బీసీ సంఘం నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేర్వేరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి, శావల్యాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయ అధికారులు మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో రామినేని రామారావు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు, అన్నదాత సుఖీభవ పథకం, కౌలు రైతు కార్డులను అర్హత కల్గియున్న రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ పనులు ప్రారంభం నాటికి అన్ని రకాల ఎరువులు కొరత లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. రైతుసేవా కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకుని మంచి ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. ఈకార్యక్రమంలో ఏఈవో పురేటి అశోక, వీఏఏలు వెంకాయమ్మ, స్రవంతి రైతులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసలు కావొద్దు



నాదెండ్ల: కార్మికులు మత్తుపదార్థాలకు బానిసలై తమ జీవితాలను పాడు చేసుకోవద్దని రూరల్ సీఐ సుబ్బానాయుడు చెప్పారు. గణపవరం శ్రీ ధనలక్ష్మీ స్పిన్నింగ్ మిల్లులో సోమవారం రాత్రి మత్తుపదార్థాల వినియోగం, రోడ్డు భద్రత వంటి అంశాలపై కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలు వినియోగించినా, విక్రయించినా చట్టరీత్యా నేరమని, చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యానికి బానిసలై డబ్బు వృథా చేసుకోవటమే కాక, మత్తులో నేరాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ కష్టపడి పనిచేసుకుని కుటుంబాలను చక్కగా పోషించుకోవాలని కోరారు. ఆయన వెంట ఎస్సై జి.పుల్లారావు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాచవరంలో పర్యటించిన ఎమ్మార్పీఎస్ నాయకులు



రొంపిచర్ల: మండలంలోని మాచవరం గ్రామంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ మండల నాయకులు పర్యటించారు. వారు ఆ గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించి కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా మండల ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ పోలెపోగు రాములు మాదిగ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి పెన్షన్లు, సంక్షేమ పథకాలు అమలుపరచాలన్నారు. మందా కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భించి 31 సంవత్సరాలు కావస్తుందన్నారు. వచ్చే నెల 7న తేదీన ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాలను ఎగురవేయాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మక్కెన పుట్టయ్య మాదిగ, చిలకా దేవదానం, జిర్రా ప్రభు, చిలకా నాగేశ్వరరావు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిలకలూరిపేట టౌన్: అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక గుండెతోటకు చెందిన షేక్ కరీముల్లా (35) పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతరులు వద్ద పెద్ద మొత్తంలో అప్పులు చేయడంతో ఒత్తిడి తట్టుకోలేక ఈ నెల 12న ఎలుకల పేస్టును సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి గుంటూరు జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య హవాబి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పథకాల అమలుపై చర్చ

రొంపిచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల ప్రజా పరిషత్ సాధారణ సభ్య సమావేశం ఎంపీపీ గడ్డం బాల నాగమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం తదితర పథకాలపై ఆయా శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బండి నిర్మల, ఎండీవో మాథ్యు బాబు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

నరసరావుపేట: పట్టణం నుంచి సత్తెనపల్లికి వెళ్లే రహదారి ఎడమవైపున ఉన్న ఆక్రమణలను తొలగించే కార్యక్రమాన్ని పురపాలక పట్టణ ప్రణాళిక అధికారులు చేపట్టారు. మంగళవారం జేసీబీ సహాయంతో రోడ్డు మార్జిన్‌లోని నిర్మాణాలు, బంకులు, షాపులను తొలగించి వాటి వద్ద యజమానులు పోసిన మట్టిని ట్రాక్టర్ సహాయంతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.